ప్రేమ పరిణామము

శ్రీమతి భోగరాజు పర్వతవర్ధనమ్మగారు

ఏలూరు మ్యునిసిపల్ హైస్కూల్లో ఫోర్తుఫారం చదువుచున్నాడు ఆనందరావు. ఈమధ్యనే పొరుగింటిలోని బాలిక కమలను ప్రేమించి హృదయం స్వాధీనంలోనుంచి పోగొట్టుకున్నాడు.

కమలా, ఆనందరావులు చిన్నతనంనుంచీ కలిసి ఆడుకునేవారు. ఆమె కపటంలేని ఆ ముఖపద్మము, సోగలైన ఆ కళ్లూ, తీర్చినముక్కూ, రోజూ చూస్తున్నా అతనికి ఎప్పుడూ మోహం అనేది కలగలేదు. యీమధ్యనే అకస్మాత్తుగా ప్రేమప్రవాహంలో పడి ఒడ్డుపట్టకుండా కొట్టుకు పోతున్నాడు.

దీనికి కారణం లేకపోలేదు. ఈమధ్యనే ఒక రోజున కమలదొడ్డిలోని జామచెట్టు ఎక్కి కాయలు కోసుకుంటున్నాడు. కమలా, తల్లీ కాలవకు వెళ్లి స్నానంచేసి వస్తున్నారు. నీళ్లోడుతూ మోకాళ్ల వరకూ వ్యాపించిన ఆ నల్లవెంట్రుకలూ, సూర్యరశ్మి పడి తళ తళా మెరుస్తున్న ఆముఖపద్మమూ, ఆనందం హృదయాన్ని చేతులోంచి పోగొట్టాయి.

అప్పటినుంచీ, నిద్రాహారాలు ఒంటబట్టటంలేదు. తరుచుగా అక్కలేటి యిసుకలో కూర్చుని ప్రేమ గీతాలు అల్లుతూండేవాడు. కమల గొప్ప సౌందర్యవతి కాకపోయినా, ఆ వుంగరాలజుట్టూ, ఎంత దువ్వినా అణక్కుండా ముఖాన్ని కమ్ముకునే ఆ ముంగురులూ, తరుచుగా చిరునవ్వు వెన్నెలలతో ప్రకాశించే ఆ తీర్చి దిద్దిన ఆ ముఖము ఏ యువకుని హృదయం స్వాధీనం తప్పించకుండా వుంటుంది? తల్లిదండ్రుల కామె ఆఖరు సంతానము. అల్లారుముద్దుగా పెంచుచుండేవారు. ఒకటి రెండుచోట్ల పెళ్లిమాటలు కూడా మాట్లాడారు. ఈ కార్తీకంలోనే పన్నెండోఏడువచ్చింది. కాని ఏ సంబంధమూ యింకా స్థిరపరచలేదు.

ఆనందరావు కమలను తరుమగా కలుసుకుని ఏమితాయిపొట్లమో, కిళ్లీయో, చేతనైన ప్రేమోపహారాలు తన ప్రాణప్రియకు అర్పిస్తుండేవాడు కమల కూడా తన స్నేహితుడికి ప్రతిఫలంగా చిరునవ్వు లర్పించేది. ఆనందం వాటితోటే సంతృప్తి పొందేవాడు.

వైశాఖం పూర్తి అయింది. కాలేజికి సెలవు లిచ్చారు. ఆనందం మేనత్తకొడుకు శ్యామలరావు వేసంగిసెలవులు మేనమామగారి యింట్లో గడపటానికి వచ్చాడు. శ్యామం ఆనందం కంటె మూడేళ్లు పెద్ద. గుంటూరు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మిత్రమండలిలో శ్యామం కవి క్రింద లెక్కయ్యబడ్డాడు. అతడి హృదయం సాహిత్యశబ్దజాలంతోటి నిండివుంది. అతడు వచ్చినప్పుడెల్లా ఆనందం ఎట్లా చదువుతున్నాడో పరీక్షచేసి, తరుమగా తల్లిదండ్రులమీద ఉండవలసిన భక్తిని గురించీ దేహవ్యాయామము, ఎదువుకోటంవల్ల ఉండే ఫలితం మొదలైన వాటిమీద లెక్చర్లిచ్చేవాడు. ఆనందం పెద్దవాడనీ, తెలివిగలవాడనీ, శ్యామాన్ని గౌరవించేవాడు. కాని యీసారి శ్యామంతోటి మాట్లాడటమే కష్టంగాఉంది ఆనందానికి. అన్నం తింటే మరి యింట్లో నిలవక పోవటమూ, ఎప్పుడూ పరధ్యాన్నముగా ఉండటం చూసి, దీనికి కారణం కనుక్కోవాలని విశ్వప్రయత్నం చేశాడు శ్యామం. కాని ఆనందం చెప్పలేదు.

ఒకరోజు ఆనందం పుస్తకాలు బయటకు తీస్తోంటే అతడి కవితాపుస్తకం బయట పడింది. ఆ పుస్తకం చటుక్కున తీసి చూశాడు శ్యామం. ఆ కవిత చదివాక శ్యామానికి ఆనందంమీద స్నేహము, శ్రద్ధ ఏర్పడ్డాయి. ఆనందం భయపడ్డాడు శ్యామం తండ్రితో చెప్పి కొట్టిస్తాడేమోనని. కాని శ్యామం ఆనందాన్ని 'నీవు త్రొక్కినదారి చాలా బాగుంది. నీకు నేను సానుభూతి చూపుతూ, నీ ప్రేమ పరిపక్వము అయ్యేమార్గము చెపుతా' నన్నాడు.

ఆనందం హృదయం కొంచెం శాంతిపడింది.

శ్యామం:—ఒరే ఆనందం! నీ కవిత్వంవల్ల ఆమె కూడా నిన్ను సమానంగానే ప్రేమించినట్లు తెలుస్తుంది అంతేనా?

ఆనందం (ఒక్కనిట్టూర్పు విడిచి)—అట్లాగే తెలుస్తుంది.

శ్యామ:—నీతోటి ఎప్పుడైనా నిన్ను ప్రేమించినట్లు చెప్పిందా?

ఆనందం:—లేదు.

శ్యామం, ఆనందం కొంతసేపు మౌనంగా వున్నారు.

తిరిగి శ్యామం అన్నాడు—చూడు! వారు మన పొరుగువారు. ఆమెతోటి స్నేహానికి అట్టే కష్టంలేదు. కాని తల్లి దండ్రులు సంబంధాలు నిశ్చయం చేసుకునేందుకు ముందుగానే నీవు ఆమెతోటి మాట్లాడి ఆమె హృదయం తెలుసుకోవటం మంచిది.

ఆనందం—ఏమిటీ! యిదికూడా అడగదగ్గ మాటే!

శ్యామం:—అడిగి తెలుసుకోవలసిందే! ఆమెని పెళ్ళిచేసుకోదలచుకుంటే నీవు తప్పకుండా ఆమె అభిప్రాయం కనుక్కోవాలి. ఆమె తల్లిదండ్రులు అనేక సంబంధాలు వెతుకుతున్నారు. ఆమె పెళ్లి అయిపోతే నీకిక బ్రతికివున్నన్నాళ్లూ పశ్చాత్తాప పడటం తప్ప చేతికి వచ్చేదిలేదు.

ఇదివిని ఆనందానికి తొందర కలిగింది. ఆమెను చాలా రోజులనుంచి ప్రేమిస్తున్నాడు గాని, పెళ్ళి చేసుకుందామని అతని కెప్పుడూ స్ఫురించలేదు.

'సరే! బాగానేవుంది ఆమెతోటి ఏమిమాట్లాడాలో చెప్పు'

'అల్లాగే చెపుతాను. ఆమెను ఏకాంతంగా తీసుకువెళ్ళి, ఆమెచేయి నీచేతితో పట్టుకుని, 'చూడు! కమలా! నిన్ను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. నీవుకూడా నన్ను ప్రేమిస్తున్నావా?' అని అడిగి, ప్రేమిస్తున్నానంటే 'నన్ను పెళ్ళిచేసుకుంటావా?' అని అడుగు. ఆమె వప్పుకుంటే ఆమెచేయి, యిదుగో! యీవిధంగా ముద్దుపెట్టుకోవాలి.'

ఆనందం:—బహుశా ఆమె వప్పుకోకపోతేనో?

శ్యామం:—మొదటిసారి ఆమె వప్పుకోక పోవచ్చును కూడాను. యిట్లాకూడా జరగటం మామూలేనని, అనేకపుస్తకాల్లో, చదివాను. కొందరు యిష్టంవుండి కూడా లేదంటారు. కొందరు నేను చెప్తే ఏమవుతుంది, అయినా నాకేం తెలుసును? అనీ అంటూంటారు. ఇంతకీ ఆమె ఏమంటుందో నాతో చెప్పు నేను తిరిగి నీకు నేర్పుతాను.

మరునాడు ఆనందం కమల యింటికి వెళ్ళాడు. కమల తల్లీవాళ్లూ ఎక్కడికో వెళ్ళారు. కమల దొడ్డివసారాలో కూర్చుని, సతీశిరోమణులు చదువుకొంటోంది.

'కమలా జామకాయలు కోసిస్తాను వస్తావా తోటలోకి?' కమలకు పచ్చి జామకాయలనేసరికి నోరూరి వెంట పరుగెత్తింది. అక్కడికెళ్లాక కమల చేయి తనచేత్తో పట్టుకుని—కమలా! నేనొకమాట అడుగుతాను. నీకు కోపంరాదు గదా?

కమల:—కోపమెందుకు? అడుగు.

ఆనందం:—నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీవు నన్ను ప్రేమిస్తావా?

కమల నిస్సంకోచంగా.

ఆనందం:—ఇన్ని రోజులనుంచీ నామనస్సులో ఒక దురాశవుంది. అది యీరోజు నీతో చెప్తాను. అయితే కమలా! నీవునన్ను పెళ్ళిచేసుకుంటావూ?

ఆనందం మొదటి మాటలు కమలకి అర్థంకాలేదు. కాని పెళ్ళి అనేసరికి బాగా తెలిసింది. "ఛీ! పో!" అంటూ చెయ్యి ఊపలాక్కొని పరుగెత్తింది.

ఆమె అందెల ఘుణఘుణ వినిపిస్తున్నంతవరకూ నిశ్చలంగా అటే చూస్తున్నాడు. ఆమె దృష్టికి దూరమయ్యాక తనలో తాను ఆలోచించుకున్నాడు. అయితే కమల పెళ్లిపేరు చెప్పటంతోటే చెయ్యి లాక్కొని పరుగెత్తింది. ఆమెకు నన్ను పెళ్లిచేసుకోవటం యిష్టంలేదా ఏమిటబ్బా?

తాను చదివిన నవలల్లోనుంచి అనేక సంఘటనలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఈమాదిరిగా జరిగిన అనేక చర్యలు జ్ఞప్తికివచ్చాయి అతడికి. అప్పుడు కొంచెం ధైర్యంతో...'అయితే సిగ్గుకు, ప్రేమకు సాహచర్యం ఉందికాదూ మరి. కమల పరుగెత్తటానికి సిగ్గే కారణం అయుండొచ్చును.' అనుకున్నాడు.

౨

శ్యామలరావు జరిగిన సంగతంతా విని, ఆమె నిన్ను ప్రేమిస్తున్నప్పుడు పెళ్లికి యివ్వాళ కాకపోతే రేపు ఒడబడుతుంది. యిప్పుడిక వాళ్ల తల్లి దండ్రుల యిష్టమే ఆలస్యం. మీ తల్లిదండ్రులూ, ఆమె తల్లి దండ్రులు వప్పుకోవాలి.

"నువ్వు యీమాట మా నాన్నతోటి చెపితే వప్పుకోరూ?"

"నేను చెప్పితే బాగుండదు. నువ్వే స్వయంగా చెప్పు."

"నేను చెప్పలేను బాబూ! పెళ్లి ప్రస్తావన తెచ్చినవాడవు నువ్వే."

"నేనే నాన్నగారితోటి చెప్పివస్తా నన్నావు మొదట. యిప్పుడు నీమాటమీదినుండి తొలిగిపోతావేం?"

శ్యామలరావుకు, ఆనందానికీ, ఆనందం తండ్రి రామారావుగారిని చూస్తే భయమే. ఆయన చాలా కోపిష్ఠి. యివ్వాళ, రేపంటూ వారంరోజులు గడిచిపోయాయి. యీలోగా ఆనందానికీ, శ్యామానికీ, మధ్య యిదివరకుండే గురు శిష్య భావంపోయి, స్నేహం ఏర్పడింది.

ఒకరోజు ఆనందం కమల పేరుమీద భావమంజరి తయారుచేశాడు. శ్యాములుడు దాన్ని చదివి వేయిసార్లు ప్రశంశించాడు. నిజంగా అనుభవం లేకుండా వ్రాసిన కవిత్వం కవిత్వమే కాదురా! అంటూ ఆకవిత తీసుకువెళ్లి కమలకి ప్రేమోపహారంగా సమర్పించమన్నాడు.

ఆనందం దాన్ని మంచి లెటరుపేపరుమీద నీలి బోర్డరు వేసి, అందమైన అక్షరాలు ఎర్రసిరాతోటి వ్రాశి దాన్ని తీసుకువెళ్లి ఎవరికీ చూపించకుండా దాచివుంచుకోమని తన ప్రాణప్రియకు యిచ్చి వచ్చాడు.

ఆమె యింట్లోకి తీసుకువెళ్లి, తన అక్కగారికి ఒక్కదానికే చూపిద్దామని కేకవేశి ఆమెకు చూపింది. ఆమె పేరు స్వర్ణలత. పదహారు ఏళ్లు. పెళ్లిఅయింది. ఆమె భర్తృప్రేమలో, రాత్రింబగళ్లు మునిగి తేలుతూవుంటుంది. మనస్సులో పొంగి పొరులుతున్న సంతోషంచేత ఆమె ముఖము ఎప్పుడూ వికశించివుంటుంది. కమలదగ్గరి కొచ్చి ఆకాకితం తీసుకుని చదవటం మొదలుపెట్టింది.

"కమలా! ప్రాణేశ్వరి! వినుము నా దొక్క మాట."

యీ చరణం చదివి స్వర్ణ నిశ్చేష్టురాలయింది. ఆమె ఆకాకితం తిరుగ బోర్లవేశి వ్రాశినవాడి పేరుకోసరం చూశింది. కాని లేదు. కమలను "ఇదెవరు వ్రాశా"రని అడిగింది.

కమల:—ఆనందం యిచ్చాడు.

స్వర్ణ:—ఎవరూ? ఆనందమా!

కమల:—అవును.

స్వర్ణ బుగ్గన చేయిపెట్టుకుని, యిదంతా వాడు నీ కెందుకు వ్రాశాడే?

కమల భయపడుతూ—నా కేం తెలుసును!

స్వర్ణ:—యిది ప్రేమకవిత్వము. మీ యిద్దరూ ప్రేమించుకున్నారా?

కమల:—ఆనందం ఒకసారి నన్ను ప్రేమిస్తున్నా నని చెప్పాడు.

స్వర్ణ చిరునవ్వు నవ్వి—"సంతోషమే, మంచి మరిదే దొరికాడు" అంటూ తిరిగి చదవటం మొదలు పెట్టింది.

కమలా! ప్రాణేశ్వరీ వినుము నా దొక్కమాట.
నీదు మూర్తినే యదయందు చేర్చినాడ.

ఆ బాలకృత్యం చూసి స్వర్ణ చిరునవ్వు నవ్వు తుంది. "ఆహా! యీ ప్రపంచంలో యింతకంటె మించిన కవిత్వం ఏముంది!" అంటూ విరగబడి నవ్వింది.

ఆ నవ్వు విని యింట్లోంచి తల్లి బయటికివచ్చింది.
"ఎందుకే! యింత వగలబడతావు?"

స్వర్ణ ఆవుత్తరం తల్లి చేతికిస్తూ "అమ్మా యిదుగో పుచ్చుకో నీ చిన్నకూతురు మొగుడు వ్రాశాడు. నీవు యింతవరకూ అల్లుణ్ణి కుదర్చక పోతే నీ కూతురే కుదుర్చుకుంది" అంది.

'ఇదెవరు వ్రాశారే?'

'అది వెనుక చెప్తానులే, ముందు యిదివిను' అంటూ తల్లిదగ్గిరనుంచి కాకితం తీసుకు చదువుతోంది.

కమలా! ప్రాణేశ్వరీ వినుము నాదొక్కమాట
నీదుమూర్తి! నే యదయందు దాల్చినాడ
స్వప్నశయన జాగరణ మొదలైన వేళలందు
అనుపమంబగు నీమూర్తి మరువకుంటి॥
కంటికిని కూర్కురాదు, వేళ కాకలియుకాదు
నిన్నుచూడనివేళ, అశ్రువులప్రవహింపచేతు
చదువుసంధ్యలమాని, నిద్రకై బడితి నేను
నీసుధామధురమగు, ముద్దుపల్కుల కలిమిలేక॥
నీదుదర్శన ప్రాప్తికై వీధి, వీధుల తిరుగుచుంటి
అన్ని రాగములకు మించిన, ప్రేమానురాగమనుభ వింప
నీదు చరణసన్నిధివేచి,యుంటినో కమలాలతాంగి
ఎన్నటికైన.........

తల్లి ఆపి—ఎవరురాశారో చెప్తావా? లేదా?
స్వ:—రామారావుగారి ఆనందం.

"ఏమిటే! ఆనందమా! నిన్న మొన్నటి గుంటవెధవకి అప్పుడే ప్రేమ కవిత్వాలా! ఏమే కమలా?" అంటూ కమలకోసరం వెతికింది.

వ్యవహారం అడ్డంగా తిరుగుతోందని కమల చెప్పకుండా జారింది అక్కడినుంచి, తల్లివెతికి జామచెట్టు క్రింద పట్టుకుంది.

'ఏమే? కమలా! యిది వాడు నీకెందుకిచ్చాడు?'

'నాకేం తెలుసును?' అంది నిర్ఘాంతపోయి.

'నీకుకాకపోతే మరెవరికి తెలుసునే? ఓసిమొద్దా! యిప్పటినుంచీ మొగుణ్ణి వెతుకుతున్నావుటే? ఏం జరిగిందో! నిజంచెపుతావా? లేదా?'

'ఆనందం యిచ్చాడు. నేనేంచేసేది. నాకింకేమీ తెలియదు.'

'ఉత్తరం యిచ్చి ఏమన్నాడు?'

'మా అమ్మకూ ఎవళ్లకూ మాపించకుండా పెట్టెలో పెట్టి జాగ్రత్తగా దాచుకోమన్నాడు.' అంటూ ఏడుస్తూ తన్నుజామచెట్టుదగ్గిరికి తీసుకెళ్లి తన్నుపెళ్లి చేసుకుంటావా? అని అడగటం ఆదీఅంతా చెప్పింది.

ఆమె తల్లికి కోపంలోనే నవ్వువచ్చింది. ఆఖరికి 'జాగ్రత్త యికనుంచి ఆవెధవతో మాట్లాడావంటే వీపు చితకేస్తాను.' అని బెదిరించింది.

కమల 'వాడెందుకిచ్చాడే యిది! నేనివ్వమని అడిగానా? నేను వాడితోటి మాట్లాడనే మాట్లాడను' అంది.

కమలతల్లి ఆకవిత్వపు కాకితం తుంపుతుంపుల కింద చింపి పొయ్యిలో వేశింది.

3

ఒకకవి చెప్పాడు లెండి—ప్రేమించేవాడు సుఖం మాట కలలోకూడా తలపెట్టకూడదు. ప్రేమమార్గము నిష్కంటకముకాదు. ప్రేమమార్గమునందలి పధికుడు దుఃఖింపవలసిందే ప్రేమ కేవలము యాతనామయము. అందులో కేవలము కన్నీళ్లే వున్నాయి' ఈమాటలు ఎవరు వప్పుకోరు?

ఆనందరావు తండ్రి రామరావుగారు డాక్టరీ చేస్తున్నాడు. ప్రాక్టీసు బాగావుంది. ప్రొద్దున్నే బయలుదేరి రోగులుని చూడటానికి వెడ్తే అతికష్టం మీద మధ్యాహ్నానికి యింటికి చేరుకుంటాడు.

ఒకరోజున రామరావుగారు భోజనంచేసి గది లోకివెళ్లి నిద్రపోతున్నాడు, బయటగదిలో ఆయన లేచిన వెంటనే మాట్లాడటంకోసరం ఆనందం, శ్యామం వేచివున్నారు. రామారావుగారు లేచి ఫలహారంజేసి మంచంమీద తిరిగి కూర్చున్నాడు. యింతలో అడుగులో అడుగు వేస్తూ శ్యామలరావు లోపలకి వచ్చి 'మామయ్యా! నేను నీతో ఒకమాట చెప్పుకోవాలి' అన్నాడు.

రామారావుగారు ఉత్సాహంతోటి శ్యామలుడి వైపుచూస్తూ 'ఏమిటది?'

శ్యామంగుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. ఎందుకు వచ్చానురా బాబూ అని పశ్చాత్తాపపడుతు నెమ్మదిగా అన్నాడు—'ఆనందం విషయమే నాకు బాగావిచారంగా ఉంది.'

'ఏం ఏమైనా జబ్బుచేశిందా?' డాక్టరుకిముందు రోగంమాటే స్ఫురిస్తుంది.

శ్యామ:—శారీరికరోగంలేదు. మానసికరోగం.

రామారావుగారు సిగరెటు ముట్టించి—ఏమిటీ!

శ్యామ:—వాడు ఒకకన్యని ప్రేమిస్తున్నాడు.

రామా:—ఏమిటీ:—

శ్యామలరావు భయపడుతూ—వాడికి ఒకకన్య మీద ప్రేమకలిగింది.

'ప్రేమా! ఎవరిమీద? ఎప్పుడు కలిగింది? కులాసాగా చెప్పవోయ్ సంగతంతాను.'

శ్యాను:—ఆనందం మనపొరుగునవున్న వెంకటేశ్వర్రావుగారి అమ్మాయి కమలిని ప్రేమించాడు అదే మీతో చెప్పటానికి వచ్చాను. వాడు సుఖపడాలని మీకుంటే, కమలకీ, వాడికీ పెళ్లి చేయాలి.

రామారావుగారు ఆరిపోయిన సిగరెటు పారేసి కొత్తది ముట్టిస్తూ—'ఎట్లా కలిగిందీ?'

శ్యామలుడు తనుచెప్పింది విని మామ సంతోషపడి అడుగుతున్నాడని ఉత్సాహంతో 'ప్రేమ ఎట్లా కలిగిందో నేను చెప్పలేను. కాని యిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకోవటం మాత్రం నాకుతెలుసును.' అన్నాడు.

అయితే! పెళ్లిచేసుకుటానంటాడా?

శ్యామం నేలవైపుచూస్తూ నెమ్మదినెమ్మదిగా— అదే ప్రేమయొక్క స్వభావపరిణామము. 'నేను కమలని పెళ్లిచేసుకోకపోతే నాజీవితం శ్మశానతుల్యం అవుతుంది' అంటున్నాడు ఆనందం.

రామా:—ఓహో స్మశానమా? ఏదీ! వాడిని ఒకసారి రమ్మనిపిలువు?

శ్యామంలేచి గదిలోకివెళ్లి ఆనందాన్ని పంపాడు. ఆనందం వెళ్లేటప్పుడు శ్యామాన్నికూడా తోడు 'మ్మన్నాడు' గాని ఒంటరిగా మాట్లాడితే బాగుంటుందంటూ శ్యామం లోపలికివెళ్లకుండా బయటనే నుంచున్నాడు.

ఆనందం గదిలోకి వెళ్లాడు నెమ్మది నెమ్మదిగా రామారావుగారు అద్దంయెదట నుంచుని మీసాల్లోంచి తెల్లవెంట్రుకలు పీకటానికి ప్రయత్నిస్తున్నాడు. యింతలో ఆనందం రావటంచూసి, యిటు తిరిగి నీ పరీక్షలింకా ఎన్నాళ్లున్నాయిరా?

ఆనందం:—యివ్వాళకి పన్నెండు రోజులున్నాయి.

'నీచదువు ఎట్లావుంది?'

'బాగానే చదివాను'

'శ్రద్ధగా చదువుతున్నావా? ఆడుతున్నావా?'

'లేదు! ఆడటంలేదు.?'

'అయితే మరేంచేస్తున్నావు? యీ మధ్యనువ్వు ప్రేమపాఠాలు చదువుతున్నావుట గాదూ?'

అతడి ఆగ్రహంచూసి ఆనందరావు వణికి పోయాడు.

రామారావుగారు నెమ్మదిగా దగ్గిరికొచ్చి ఎడమ చేత్తో ఆనందం కుడిచెవ్విపట్టుకుని,—ఏం! జవాబు చెప్పు ?

ఆనందం మాట్లాడబోయాడుగాని మాట నోట్లోంచి బయటికి రాలేదు. తండ్రిగారి కళ్లు ఎఱ్ఱబడ్డాయి! పళ్లుకొరుకుతూ—'స్టుపిడ్, రాస్కెల్!! పరీక్షలింకా పదిరోజులుంటే, చదువుకోవటం మాని లవ్ (love) అంటూ మొదలుపెట్టావురా?' అంటూ చెంప పగిలేటట్టు టపటపా లెఖ్ఖలేనన్ని లెంపకాయలు కొట్టాడు.

అప్పటికి శ్యామంలోపలకి రావటానికి అడుగు పెడుతున్నాడు. యీ దెబ్బలు వినేసరికి మాయమయి పోయాడు.

ఆనందం ముఖం చేతుల్తో కప్పుకుని, ఏడుస్తున్నాడు.

రామారావుగారు కుఱ్ఱాడిని వదిలి మంచంమీద చతికిలబడి,—ఇప్పటికి పదిరోజుల్నుంచి చూస్తున్నాను. ఒకటే గుసగుస. ఊళ్లేలటానికా దండెత్తటానికిరా? ఓరి వెధవా! ఓరిదొంగా! మాదర్ఫోడ్. యిప్పటినుంచీ పెళ్లికావాలేం? నీకు పెళ్లికాకపోతే నీ జీవితం స్మశానం అవుతుందీ? ఈ మాట లెవరు నేర్పారురా? యింతవాడవయ్యావు చదువుసు వృద్ధిలోకివచ్చి సంపాదించుదాము అనేంలేదూ? పెళ్లి కావాలా యిప్పుడు? నేను ప్రొద్దుటినుంచి సాయంత్రంవరకూ, రోగుల నాడులు చూస్తూ కొంపలవెట తిరగటమా? నీకు చదువుకు వృద్ధిలోకి వద్దామనే ఆలోచనేమీలేదూ? నాకొడుకు ప్రేమపాఠాలు చదువుతున్నాడయ్యా! ఈ ప్రేమ కూడుపెట్టుతుంది. యీ వెధవకి ఈ శ్యామం కాలేజిలో పగువుకు యింత సన్యాసి అయ్యాడనుకోలేదు. యీ వెధవవద్ద ఆ వెధవ వకాల్తా పుచ్చుకొచ్చాడు. పో! యిక్కడి నుంచి పరుగెత్తు!! ఇంకెప్పుడైనా యిల్లాచేశావంటే, మెత్తగా చితుకతంతాను పో!

ఆనందం ఏడుస్తూ బయటికి పోయాడు.

డాక్టరుగారి చికిత్సకు ఫలితం వెంటనే కనుపించింది. ఆనందంకూడా మంచి కుఱ్ఱాడేనని చెప్పాలిలెండి. నవలలు చదివి వాడు చెడిపోయాడేకాని, నవలల్లోలాగ సన్యాసయి యిల్లువదలి పోలేదు. విషంతిని చావాలేదు. ముఖ్యంగా కమల పెళ్లిలో ఫలహారాలబుట్ట ఖాళీచేశాడు. దాంతో అజీర్ణంచేసి వారం రోజులు స్కూలుకు నాగావేశాడు. శ్యామంవెళ్లిపోవటంవల్ల, ప్రేమ ఆదర్శమునుంచి పడిపోయినందుకు ఎవరిముందూ, జవాబుచెప్ప నక్కరలేకపోయింది. ఆనందరావు యిప్పుడు ప్రేమ పదాలు మాని, పాఠాలు శ్రద్ధాభక్తులతో చదువుతున్నాడు.